సాక్షి
వికారాబాద్
సోమవారం । 23 । జూన్ । 2025



నిధులు పక్కదారి!
తాండూరు మున్సిపల్‌లో అధికారులు బిల్లుల్లో చేతివాటం ప్రదర్శించారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 8లో▸



నిబంధనలకు తూట్లు
పట్టణం మీదుగా వెళ్తున్న నేషనల్ హైవే 167(ఎన్) డ్రైన్ నిర్మాణ పనులు ఇష్టానుసారంగా కొనసాగుతున్నాయి. 8లో▸



గెట్ల పంచాయితీ!
దౌల్తాబాద్‌కు చెందిన ఓ రైతు ఆరు నెలల క్రితం భూమి కొలత కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకున్నాడు. 9లో▸

న్యూస్‌రీల్

టైలరింగ్ శిక్షణతో ఉపాధి మార్గం

రాష్ట్ర సాగునీటి శాఖ ఎత్తిపోతల సలహాదారు పెంటారెడ్డి



మాట్లాడుతున్న పెంటారెడ్డి

ధారూరు: టైలరింగ్ నేర్పించడం అంటే ఉపాధి చూపినట్లేనని రాష్ట్ర సాగునీటి శాఖ ఎత్తిపోతల సలహాదారు పెంటారెడ్డి అన్నారు. మండల పరిధిలోని కేరెళ్లి శ్రీసత్యసాయి సార్వజనిక కేంద్రంలో ఆదివారం టైలరింగ్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన శిక్షణ పొందుతున్న వారికి పలు సూచనలు ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో సత్యసాయి సేవా సంస్థల సేవలతో పేదలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. సత్యసాయి సేవా సంస్థల కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, కేరెళ్లి శ్రీసత్యసాయి సార్వజనిక కేంద్రం అధ్యక్షుడు రఘునందన్, ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌కుమార్, కన్వీనర్ రామకృష్ణారెడ్డి, సేవా సంస్థల బాధ్యులు సోమిరెడ్డి, నాగరాజు, బల్వంత్‌రెడ్డి, నర్సింలు, రవి, శ్రీకాంత్‌రెడ్డి మహిళలు పాల్గొన్నారు.

టీఎంహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా ఖదీర్



ఖదీర్‌ను సన్మానిస్తున్న అబ్దుల్ వహాబ్

బంట్వారం: తెలంగాణ మైనార్టీ హక్కుల పోరాట సమితి(టీఎంహెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడిగా తొర్మామిడికి చెందిన ఖదీర్ పాషా నియమితులయ్యారు. ఆదివారం పెద్దేముల్‌లో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ వహాబ్ సమక్షంలో ఖదీర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుని నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఖదీర్ మాట్లాడుతూ.. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా మైనార్టీల హక్కుల సాధన కోసం శక్తి వంచన లేకుండా పని చేస్తానన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మైనార్టీల సంక్షేమం కోసం కల్పించిన రిజర్వేషన్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రంలో 14శాతం ఉన్న ముస్లింలను రాజకీయ పార్టీలు కేవలం ఓటు బ్యాంకు గానే వాడుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ వహాబ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రజకులను ఆదుకోవాలి

రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపి



మాట్లాడుతున్న గోపి రజక

కొడంగల్: రజకులకు సంక్షేమ పథకాలు వర్తింపజేస్తూ తమ కులస్తులను ఆదుకోవాలని రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అన్నారంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడి 11 ఏళ్లు దాటినా రజకుల బతుకులు మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ప్రమాదవశాత్తు మరణించిన రజకుల కుటుంబాలకు రూ.10లక్షల ఆర్థికసాయం అందజేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రతీ గ్రామంలో దోబీఘాట్‌లు, కమ్యూనిటీ హాల్స్ నిర్మించి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రవీందర్, అశోక్, వెంకటేశ్, మోహన్, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

మరకత శివాలయాన్ని దర్శించుకున్న వెన్నెల

శంకర్‌పల్లి: మండలంలోని చెందిప్ప గ్రామంలో వెలసిన 11వ శతాబ్దపు బ్రహ్మసూత్ర మరకత శివాలయాన్ని ఆదివారం తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్, గుమ్మడి వెన్నెల గద్దర్ దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆమెకి శేషవస్త్రం కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం వెన్నెల మాట్లాడుతూ.. మరకత శివాలయాన్ని సందర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మళ్లీ సమయం తీసుకొని వస్తానని, ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు సదానందం గౌడ్, చైర్మన్ గోపాల్‌రెడ్డి, సభ్యులు మోహన్, హన్మంతు పాల్గొన్నారు.



బోటింగ్ చేస్తున్న యువత

పర్యాటక శోభ

కోట్‌పల్లి ప్రాజెక్టుకు ఆదివారం పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఎండలు తగ్గడంతో కుటుంబసమేతంగా వచ్చిన సందర్శకులు ప్రాజెక్ట్ నీటిలో సందడిగా గడిపారు. యువతీ యువకులు బోటింగ్ చేస్తూ సెల్ఫీలు దిగుతూ కేరింతలు కొట్టారు. – ధారూరు

మహార్దశ



మహానగరం మరింత విస్తరించనుంది. త్వరలో నిర్మించనున్న రీజినల్ రింగ్ రోడ్డు(ట్రిపుల్ ఆర్) ఆవల ఐదు కిలోమీటర్ల వరకు పరిధిని విస్తరించేందుకు ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అభివృద్ధికి ఊపందుకోనుందని జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హెచ్‌ఎండీఏ పరిధిలోకి జిల్లా

- ఐదు మండలాలు, 54 రెవెన్యూ గ్రామాలు, 20కి పైగా గ్రామాలు
- ఒక్క పూడురు నుంచే 23 రెవెన్యూ గ్రామాలు
- ఊపందుకోనున్న అభివృద్ధి

వికారాబాద్: గతంలో ఏడు జిల్లాలు హెచ్‌ఎండీఏ పరిధిలో ఉండగా ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో 11 జిల్లాలకు విస్తరించింది. ఇందుకు సంబంధించి ఇటీవల ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు సైతం జారీ చేసింది. ట్రిపుల్ ఆర్‌కు ఐదు కిలో మీటర్ల ఆవలి వరకు హెచ్‌ఎండీఏ పరిధిని విస్తరించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఆ పరిధిలోకి మన జిల్లా సైతం వచ్చేసింది. జిల్లా పరిధిలోని ఐదు మండలాలకు చెందిన 54 రెవెన్యూ గ్రామాలు, మరో 20కి పైగా అనుబంధ గ్రామాలు హెచ్‌ఎండీఏ పరిధిలోకి చేరుస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

జిల్లా సమగ్రాభివృద్ధికి స్పెషల్ జీఓ

రాష్ట్ర రాజధానికి కూతవేటు దూరంలో ఉన్న జిల్లా అభివృద్ధిలో అందరాని దూరంలో నిలిచిపోయింది. నాయకత్వ సమస్యతో కొట్టుమిట్టాడుతూ నెట్టుకొస్తున్న జిల్లాకు ఏకకాలంలో ముఖ్యమంత్రి, స్పీకర్ పదవులు వరించాయి. సీఎంగా ఉన్న రేవంత్‌రెడ్డి తొలుత కడా(కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) ఏర్పాటు చేయడంతో అభివృద్ధి సొంత నియోజకవర్గానికే పరిమితం చేస్తారా అంటూ మిగిలిన జిల్లాల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. జిల్లా పరిధిలోని మూడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలపై విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలో ప్రభుత్వం జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రత్యేక జీఓ 190 విడుదల చేసిన విషయం విదితమే. వుడా(వికారాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) పేరుతో జిల్లాను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది.

వుడా పరిధిలో 493, హెచ్‌ఎండీఏలో 54 రెవెన్యూ గ్రామాలు

జిల్లా సమగ్రాభివృద్ధికి మార్చిలో స్పెషల్ జీఓ 190 విడుదల చేయగా.. కడా పేరిట కొడంగల్ నియోజకవర్గంలో రూ.6 వేల కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. తాజా జిల్లాలోని పలు ప్రాంతాలు హెచ్‌ఎండీఏ పరిధిలోకి చేర్చడంతో అభివృద్ధి మరింత ఊపందుకుంటుందని జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వుడా పరిధిలోకి నాలుగు మున్సిపాలిటీలు (వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్)తో పాటు, 493 రెవెన్యూ గ్రామాలు రానున్నాయి. హెచ్‌ఎండీఏ పరిధిలోకి ఐదు మండలాల నుంచి 54 రెవెన్యూ గ్రామాలు, 20 గ్రామాలు చేర్చే అవకాశం ఉంది. రాష్ట్ర అభివృద్ధిలో రాజధాని హైదరాబాద్‌తో పాటు శాటిలైట్ టౌన్‌షిప్‌ల డెవలప్‌మెంట్ కీలకం కానుంది. ఇందులో భాగంగా ప్రభుత్వం ఇప్పటికే పలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల ఏర్పాటు చేసి అభివృద్ధి పనులను వేగిరం చేస్తోంది.

హెచ్‌ఎండీఏ పరిధిలోకి వచ్చే గ్రామాలివే..

రీజనల్ రింగు రోడ్డుకు వెలుపల ఐదు కిలోమీటర్ల వరకు హెచ్‌ఎండీఏ పరిధిని విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో జిల్లా పరిధిలోని ఏ మండలాలు, గ్రామాలు దీని పరిధిలోకి వస్తాయనే విషయంలో ప్రభుత్వం జీఓ విడుదల చేసి చర్చలకు తెరదింపింది. పూడూరు, నవాబుపేట మండల కేంద్రాలతో పాటు పది నుంచి ఇరవైకి పైగా గ్రామాలు, వికారాబాద్ మండల కేంద్రంతో పాటు వికారాబాద్ మోమిన్‌పేట మండలాల పరిధిలోని మూడు నుంచి నాలుగు రెవెన్యూ గ్రామాలు హెచ్‌ఎండీఏ పరిధిలోకి వస్తున్నాయి. వీటితో పాటు ప్రతీ మండల నుంచి 20 వరకు అనుబంధ గ్రామాలున్నాయి.

హెచ్‌ఎండీఏ పరిధిలోని రెవెన్యూ గ్రామాలు

మండలం	రెవెన్యూ గ్రామాలు
పూడూరు	అంగడిచిట్టెంపల్లి, చన్గోముల్, చీలాపూర్, చింతల్‌పల్లి, కంద్లపల్లి, కంకల్, కెరవెళ్లి, కడ్మూర్, కొత్తపల్లి, మంచన్‌పల్లి, మన్నెగూడ, మేడిపల్లి, మిర్జాపూర్, మిట్టకంకల్, నిజామ్‌పేట్ మేడిపల్లి, పెద్ద ఉమ్మెంతాల్, పూడూరు,కుద్బుల్లాపూర్, రేగడిమామిడిపల్లి, పోమన్‌గుర్తి, తిర్మలాపూర్, ఎన్కెపల్లి, తుర్కెన్కెపల్లి
నవాబుపేట	అక్నాపూర్, చించల్‌పేట్, గంగ్యాడ, గుబ్బడిఫతేపూర్, లింగంపల్లి, మాదిరెడ్డిపల్లి, ముబారక్‌పూర్, నవాబుపేట, పూలపల్లి, పులిమామిడి, ఎల్లకొండ
వికారాబాద్	వికారాబాద్(జిల్లా కేంద్రం) బూర్గుపల్లి, ధన్నారం, గెరిగెట్‌పల్లి, గుడుపల్లి, కొంపల్లి, మద్గుల్‌చిట్టెంపల్లి, పాతూరు, పీరంపల్లి, పులుసుమామిడి, సిద్దులూరు(చెంచలం), సిద్దులూరు(పాయాగ), సిద్దులూర్ (మునుగాల)
మోమిన్‌పేట	చీమల్‌ధరి, చక్రంపల్లి, దేవరంపల్లి
పరిగి	చిట్యాల్, మాదారం, రాపోల్, తొండపల్లి

విద్య మాటున వ్యాపారం

- పాఠ్య, నోట్ పుస్తకాల విక్రయాల్లో ప్రైవేట్ పాఠశాలల మాయాజాలం
- తాము సూచించిన చోటే కొనుగోలు చేయాలని తల్లిదండ్రులకు చీటీలు
- అడ్మిషన్ పేరిట రూ.5 వేల నుంచి రూ.10వేల వరకు వసూళ్లు
- విద్యాశాఖకు ఫిర్యాదు చేసిన బీసీ జేఏసీ సంఘం సభ్యులు
- పట్టించుకోని అధికారులు



మండల విద్యాధికారికి వినతిపత్రం అందిస్తున్న బీసీ జేఏసీ నాయకులు (ఫైల్)

తాండూరు: పిల్లలను ఉన్నత విద్యావంతులను చేయాలనే తల్లిదండ్రుల కోరికను ప్రైవేట్ పాఠశాలలు ఆసరాగా చేసుకుంటున్నాయి. తల్లిదండ్రులకు పిల్లలపై ఉన్న ప్రేమ ప్రైవేట్ పాఠశాలలకు కాసుల వర్షం కురిపిస్తోంది. విద్యాసంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో న్యూ అడ్మిషన్లు, ఏడాది ఫీజు పేరిట ప్రైవేట్ పాఠశాలల యాజమన్యాలు అడ్డగోలు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇంతటితో ఆగకుండా పుస్తకాలు తాము చెప్పిన చోటే కొనుగోలు చేయాలని హుకూం జారీ చేస్తున్నారు. ఈ విద్యావ్యాపారాన్ని అరికట్టాలని బీసీ జేఏసీ సంఘాలు, విద్యార్థి సంఘాలు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారే కరువయ్యాయరు.

రూట్ మార్చి విక్రయాలు

జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు, 20 మండలాలున్నాయి. విద్యాశాఖ వెల్లడించిన ప్రకారం జిల్లా వ్యాప్తంగా 198 ప్రైవేటు పాఠశాలలు కొనసాగుతుండగా 47,534 మంది విద్యార్థులున్నారు. తాండూరు, కొడంగల్, వికారాబాద్, పరిగి పట్టణాలలో ప్రైవేటు స్కూళ్లు అధికంగా ఉన్నాయి. గతంలో పాఠశాల్లోనే నోట్ పుస్తకాలు, యూనిఫాంలు విక్రయించేవారు. మూడేళ్లుగా విద్యార్థి సంఘాలు, బీసీ జేఏసీ సంఘాలు ఫిర్యాదులు చేస్తున్న నేపథ్యంలో విక్రయాలు నిలిచిపోయాయి. రూట్ మార్చిన యాజమాన్యాలు తాము సూచించిన షాపుల్లోనే పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాంలు కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. 1వ తరగతి విద్యార్థికి పుస్తకాల సెట్‌కు రూ.6,500 నుంచి రూ.8 వేల వరకు, 2 నుంచి 10వ తరగతి విద్యార్థుల పుస్తకాల సెట్‌కు ఒక్కో విద్యార్థికి రూ.7వేల నుంచి రూ.13 వేల వరకు వెచ్చించాల్సి వస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. అదే సెట్ ఇతర సెంటర్లలో కొనుగోలు చేస్తే సగం ధరకే వస్తున్నాయని చెబుతున్నారు. యూనిఫాంలు సైతం పాఠశాల యాజమాన్యాలు సూచించిన దుకాణాల్లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి దాపురించిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతేడాదితో పోలిస్తే రూ.5వేల వరకు ఫీజులు పెరిగాయని అడ్మిషన్ ఫీజు రూ.5వేల నుంచి రూ.10 వేలకు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల పేరిట దోపిడీ



నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్య, నోట్ పుస్తకాలు విక్రయిస్తున్నారు. పాఠ్య పుస్తకాల ధరలను ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలే నిర్ణయిస్తున్నాయి. విద్యార్థుల పేరిట సాగిస్తున్న ఈ దోపిడీని అరికట్టాలి. ఈ విషయమై ఇప్పటికే విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేశాం.

– భాను ప్రసాద్, బీసీ జేఏసీ నాయకుడు, తాండూరు

ప్రైవేట్ స్కూళ్లను హెచ్చరించాం



ప్రైవేటు స్కూళ్లలో పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్నారంటూ వచ్చిన ఫిర్యాదును ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకొన్నారు. దీంతో ప్రైవేటు స్కూల్ యాజమాన్యాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలను విక్రయించినా, అధిక ఫీజులు వసూలు చేసినట్లు తెలిసినా అనుమతులను రద్దు చేస్తామని హెచ్చరించాం.

– వెంకటయ్యగౌడ్, ఎంఈఓ, తాండూరు

అంబేడ్కర్ విగ్రహం ధ్వంసానికి యత్నం



పుట్టపహాడ్ ప్రధాన చౌరస్తాలో ఆందోళన చేస్తున్న అఖిలపక్ష నాయకులు

పరిగి–మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై ఆందోళన

కుల్కచర్ల: మండల పరిధిలోని పుట్టపహాడ్ గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసేందుకు యత్నించారు. విషయం తెలుసుకున్న వివిధ పార్టీల నేతలు, అంబేడ్కర్ సంఘాల నాయకులు గ్రామానికి చేరుకుని ప్రధాన చౌరస్తాలో బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్ విగ్రహంపై దాడికి యత్నించడం సిగ్గుమాలిన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్తుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రమేశ్ తెలిపారు. ఆందోళనలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కుల్కచర్ల ఏఎంసీ చైర్మన్ ఆంజనేయులు, బ్లాక్ బి అధ్యక్షుడు భరత్‌కుమార్, పలువురు నాయకులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న గుమ్మడి వెన్నెల తదితరులు



సంప్రదాయ వస్త్రాలు ధరించి రన్‌లో పాల్గొన్న మహిళలు

ఉత్సాహంగా ‘ఎథ్నిక్ రన్’

శంకర్‌పల్లి: మండలంలోని పిల్లిగుండ్ల గ్రామంలో ఆదివారం గండిపేట వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ‘ఎథ్నిక్ రన్ –2025’ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శారద నేరెళ్ల, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ గుమ్మడి వెన్నెల ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వందలాది మంది మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శారద నేరెళ్ల మాట్లాడుతూ.. మహిళల ఆరోగ్యం, ప్లాస్టిక్ నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావడం గొప్ప విషయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని చేపట్టాలని ఆకాంక్షించారు. గుమ్మడి వెన్నెల మాట్లాడుతూ.. సంస్కృతి, సంప్రదాయాలను గుర్తు చేస్తూ యువతలో ఆసక్తి పెంపొందించడంలో గండిపేట వెల్ఫేర్ సొసైటీ విజయవంతమైందని అభినందించారు. సొసైటీ జాయింట్ సెక్రెటరీ వాణి మాట్లాడుతూ.. పదేళ్ల క్రితం తమ సొసైటీ ఏర్పడిందని, అప్పటి నుంచి మహిళల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిర్మూలన అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఏడు ప్రాంతాల్లో ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు నడుపుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్ఫూర్తి

రాష్ట్రపతి భవన్‌లో అతిథ్యం.. స్వయానా రాష్ట్రపతితో అభినందనలు.. కేంద్ర మంత్రులతో ప్రశంసలు.. దిగ్గజ శాస్త్రవేత్తలతో సమాలోచనలు.. ఇలాంటి అరుదైన అవకాశం వస్తుందంటే ఎవరు మాత్రం కాదంటారు.. కానీ అందుకోసం విద్యార్థులు కాస్త కష్టపడాల్సి ఉంటుంది. తమ తెలివికి పదును పెట్టాలి.

- జాతీయ స్థాయిలో ‘ఇన్‌స్పైర్ మనక్’
- స్టూడెంట్స్ ఆవిష్కరణలకు ఆహ్వానం
- ప్రతిభ చూపినవారికి నగదు పురస్కారాలు
- ఆన్‌లైన్ ద్వారా సెప్టెంబర్ 15 వరకు దరఖాస్తుల స్వీకరణ

కేశంపేట: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను ప్రయోగాల వైపు నడిపించి వారి ఆలోచనలకు పదును పెట్టి భావి భారత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈ మేరకు ‘ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పర్స్యూట్ ఫర్ ఇన్‌స్పైర్డ్ రీసెర్చ్’ (ఇన్‌స్పైర్) పేరుతో ఇన్‌స్పైర్ మనక్ పురస్కారాలను అందిస్తోంది. ఆన్‌లైన్ ద్వారా 2025–26 విద్యా సంవత్సరానికి నామినేషన్లు స్వీకరిస్తోంది.

ఎవరు అర్హులంటే..

10 నుంచి 17 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి 6 నుంచి 10వ తరగతి చదివే ప్రతిభ కలిగిన విద్యార్థులకు అవకాశం. ప్రభుత్వ, ప్రైవేట్, గురుకుల, మోడల్ స్కూల్స్, కేజీబీవీ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు అర్హులు. వీరు పాఠశాలలోని సైన్స్ ఉపాధ్యాయుడి గైడ్ లైన్స్ పాటిస్తూ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు చేసుకునే విధానం

- ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.
- www.inspireawards-dst.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి న్యూ రిజిస్ట్రేషన్ ఆప్షన్ ఎంచుకోవాలి.
- పాఠశాలకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకొని, సేవ్ చేసుకోవాలి. ఈ దరఖాస్తు జిల్లా అథారిటీకి వెళ్తుంది.
- వీరు ఆమోదిస్తే విద్యార్థికి సంబంధించి పొందుపర్చిన మెయిల్ ఐడీకి యూజర్ ఐడీతో కూడిన లింక్ వస్తుంది.
- అప్పుడు విద్యార్థులు యూజర్ ఐడీకి పాస్‌వర్డ్‌ను క్రియేట్ చేసుకోవాల్సి ఉంటుంది.
- విద్యార్థి తన సమాచారంతో పాటు బ్యాంక్ అకౌంట్ నంబర్, ఆధార్ నంబర్ నమోదు చేయాల్సి ఉంటుంది.
- విద్యార్థి ప్రదర్శించాలనుకున్న ప్రాజెక్టును సంక్షిప్తంగా వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి.
- ఎంపికైన ప్రాజెక్టు ప్రయోగ నిమిత్తం విద్యార్థి బ్యాంక్ ఖాతాకు రూ.పదివేలు జమ చేస్తారు.
- రాష్ట్ర స్థాయికి ప్రాజెక్టు ఎంపికై తే రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు అందిస్తారు.
- ఆన్‌లైన్‌లో ఉచితంగా విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకునే అవకాశం కల్పించారు.

ఎప్పటిలోగా అంటే..

విద్యార్థులు తమ పేర్లను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి సెప్టెంబర్ 15 వరకు కేంద్ర ప్రభుత్వం గడువు విధించింది. విద్యార్థులు తాము చదువుతున్న పాఠశాలల్లో సైన్స్ ఉపాధ్యాయులతో కలిసి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి.

గత విద్యా సంవత్సరం..

2024–25 విద్యా సంవత్సరంలో జిల్లా స్థాయికి 1,881 నామినేషన్లు ఎంపికయ్యాయి. వీటి నుంచి ఉత్తమ ప్రతిభ కనబర్చిన 198 నామినేషన్లు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. వీటి నుంచి నాలుగు జాతీయ స్థాయికి వెళ్లాయి. ఈ విద్యా సంవత్సరం జాతీయ స్థాయిలో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటే విధంగా సైన్స్ ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

క్లుప్తంగా

అర్ధరాత్రి గర్భిణీ అవస్థ

- 108కి కాల్ చేసినా స్పందన కరువు
- ప్రైవేటు వాహనంలో ఆస్పత్రికి తరలింపు

బషీరాబాద్: మెడికల్ అత్యవసర సేవలు పడకేశాయి. అర్ధరాత్రి పురిటి నొప్పులతో ఆస్పత్రికి వెళ్లడానికి 108కి కాల్ చేస్తే బిజీ అంటూ రెండు గంటల పాటు ఎదురు చూశారు. చివరకు అంబులెన్స్ రాకపోవడంతో ఓ ప్రైవేటు వాహనంలో గర్భిణీని తాండూరు మాతాశిశు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పురిటి నొప్పులతో తల్లడిల్లిన ఆమెకి వైద్యులు కాన్పు చేశారు. ఈ ఘటన మండలంలోని నవల్గాలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కాశీంపూర్ శ్యామల నిండు గర్భిణీ. శనివారం రాత్రి 11.45 గంటలకు పురిటి నొప్పులు రావడంతో భర్త నరేష్ 108 అంబులెన్స్‌కు కాల్ చేశారు. అవి ఇతర సేవల్లో బిజీ ఉన్నాయి. 30 నిమిషాలు ఆగాలని టోల్ ఫ్రీ సిబ్బంది చెప్పారు. తీరా అర్ధ గంట తర్వాతా చేస్తే బిజీ ఉన్నాయి.. తర్వాత చేయండని రెండు గంటల పాటు తమను వేచి ఉండేలా చేశారని బాధితురాలి భర్త ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ప్రైవేట్ వాహనంలో తాండూరులోని మాతా శిశు ఆస్పత్రికి తరలించారు. గర్భిణీకి అక్కడి వైద్యులు కాన్పు చేయడంతో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.

ఉద్యోగి అనుమానాస్పద మృతి


వెంకటేశ్వరరావు

మీర్‌పేట: అనుమానాస్పద స్థితిలో ఓ ప్రభుత్వ ఉద్యోగి మృతి చెందిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కాలనీవాసులు, ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. ఏపీ కృష్ణా జిల్లా పెద్దమద్దాలి గ్రామానికి చెందిన బండి వెంకటేశ్వరరావు(59) పదేళ్లుగా బడంగ్‌పేట సాయి ప్రభు హోమ్స్ కాలనీలో భార్య జయంతి, కుమారుడు రాజ్‌భరత్, కోడలు గౌతమితో కలిసి ఉంటున్నాడు. ఆయన ఆబిడ్స్‌లోని పేఅండ్ అకౌంట్స్ కార్యాలయంలో ఆడిటర్‌గా విధులు నిర్వహించేవాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం వెంకటేశ్వరరావు నీటి సంపులో శవమై తేలాడు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు ఉస్మానియాకు తరలించారు.

మృతిపై అనుమానాలు

కొంత కాలంగా తనను భార్య, కుమారుడు, కోడలు వేధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని మృతుడు వెంకటేశ్వరరావు తరచూ తమతో చెప్పేవాడని కాలనీవాసులు పేర్కొన్నారు. తండ్రి చనిపోతే కుమారుడికి ఉద్యోగం వస్తుందని, అందుకే మానసికంగా వేధిస్తున్నారని తెలిపినట్లు చెప్పారు. ఇక్కడే ఉంటే తనను చంపేలా ఉన్నారని, వారం రోజుల్లో మలక్‌పేటలోని ప్రభుత్వ క్వార్టర్‌కు మారుతానని శనివారం రాత్రి చెప్పినట్లు స్థానికులు వెల్లడించారు. ఆయన మృతిపై అనుమానం ఉందని, మృతుడి కుమార్తె ధరణిదేవి మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.


వేడుకగా వీరభద్రస్వామి ఆలయ వార్షికోత్సవం

రాజేంద్రనగర్: బుద్వేల్‌లోని వీరభద్రస్వామి భద్రకాళి ఆలయ మూడవ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆ సందర్భంగా దేవాలయాన్ని వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. ఉదయం అభిషేకం, అలంకరణ అనంతరం భక్తులకు వీరభద్ర స్వామి భద్రకాళి అమ్మవారి దర్శనాన్ని ప్రారంభించారు. దేవాలయానికి వచ్చే భక్తులకు ఇబ్బంది కలుగకుండా తగు ఏర్పాట్లు చేపట్టారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామి, అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

హైవేపై గుంత.. వాహనదారుల చింత

జాతీయ రహదారిపై ఏర్పడిన గుంత వాహనదారులను అవస్థల పాలు చేస్తోంది. నిత్యం వాహనాల రాకపోకలతో బిజీగా ఉంటే ఎన్‌హెచ్‌-163పై రేగడిమైలారం నాగలికుంట వద్ద గుంత ఏర్పడి అంతరాయం కలిగిస్తోంది. అది హృదయాకారాన్ని పోలి ఉండడం గమనార్హం. అధికారులు ఈ రోడ్డుకి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– బొంరాస్‌పేట



మున్సిపల్ నిధులు పక్కదారి!

- రూ.10 లక్షల సామగ్రి కొనుగోలుకి రూ.50 లక్షల బిల్లు
- పాత బ్లీచింగ్ స్టాక్ చూపించి కాసులు నొక్కేసిన వైనం
- అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు


తాండూరు మున్సిపల్ కార్యాలయం


కార్యాలయంలో కొనుగోలు చేసిన శానిటరీ కిట్స్

తాండూరు: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు తాండూరు మున్సిపల్ అధికారులు చేపట్టిన చర్యల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కౌన్సిల్ సమావేశంలో ఆమోదం పొందని పనులకు అడ్డగోలుగా నిధులు వెచ్చించారని జోరుగా ప్రచారం జరుగుతోంది. పారిశుద్ధ్య కార్మికుల పేరిట, పాత స్టాక్ బ్లీచింగ్ పౌడర్ నిల్వలను చూపించి ఏకంగా రూ.15 లక్షలకు పైగా అవినీతికి పాల్పడినట్లు స్థానికంగా చర్చనీయాంశమైంది.

ఒక్కో చీర రూ.1,800

తాండూరు మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 36 వార్డులున్నాయి. దాదాపు 15 వేల గృహాలున్నాయి. అందుకు తగ్గట్లుగానే సుమారు 260 మంది వరకు పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు మున్సిపల్ అధికారులు ప్రత్యేకంగా పారిశుద్ధ్య పనులు చేయిస్తారు. అందుకుగాను సిబ్బందికి శానిటరీ కిట్స్‌తో పాటు దుస్తులు పంపిణీ చేస్తారు. ఇటీవల మున్సిపల్ కమిషనర్‌తో పాటు సిబ్బంది ఆయా సామగ్రిని తీసుకొచ్చారు. ప్రత్యేకాధికారి సుధీర్ అనుమతితో హాకా సంస్థకు నామినేషన్ పద్ధతిన ఈ కాంట్రాక్ట్ మొదట అప్పగించారు. అది కాదని స్థానిక కాంట్రాక్టర్ ద్వారానే సామగ్రిని కొనుగోలు చేయించారు. ఇందులో నాసిరకం దుస్తులకే అధిక ధరలు చెల్లించినట్లు బిల్లులు సృష్టించారు. పారిశుద్ధ్య పనులు చేసే మహిళలకు ఇచ్చే ఒక్కో చీర రూ.500 వరకు ఉంటే ఏకంగా రూ.1,800 వెచ్చించినట్లు చూపారు. ఒక టవల్ ఖరీదు రూ.100 వరకు ఉంటే దాన్ని రూ.600లకు కొన్నట్లు బిల్లులు రూపొందించడం గమనార్హం.

పాత స్టాక్ చూపి నిధులు స్వాహా

బ్లీచింగ్ పౌడర్ నిధులను మున్సిపల్ అధికారులు పక్కదారి పట్టించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ సీజన్‌లో బ్లీచింగ్ పౌడర్ 10 టన్నుల వరకు వినియోగం ఉంటుందంటూ రికార్డులు సిద్ధం చేశారు. అయితే క్వింటాలుకు సుమారు రూ.1,700ల వరకు పలుకుతోంది. అయితే పాత మున్సిపల్ కార్యాలయంలో బ్లీచింగ్ పౌడర్ పాత స్టాక్ నిల్వలున్నాయి. వాటినే చూయించి మున్సిపల్ అధికారులు నిధులను దారి మళ్లించారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతరు

ఈ ఏడాది జనవరి నెలలో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులతో జరిగిన చివరి సమావేశంలో ఎజెండాలో శానిటేషన్ పనుల కోసం రూ.40 లక్షల నిధుల ఆమోదం కోసం తీసుకెళ్లారు. అయితే పలువురు కౌన్సిలర్‌లు బ్లీచింగ్ పౌడర్ పేరిట నిధులు దుర్వినియోగం చేస్తున్నారంటూ అప్పట్లోనే అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అంశాన్ని పక్కన పెట్టాలని కమిషనర్‌కు సూచించారు. ఆరు నెలల తర్వాత మున్సిపల్ అధికారులు రూ.40 లక్షలతో పాటు అదనంగా మరో రూ.10 లక్షలు పెంచి పారిశుద్ధ్య సామగ్రిని కొనుగోలు చేయడం విమర్శలకు తావిస్తోంది.

వివరాలు తెలుసుకుంటా..



మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల కోసం కొనుగోలు చేసిన సామగ్రికి నిధులు ఎన్ని వెచ్చించారనే అంశం నా దృష్టికి రాలేదు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను అడిగి వివరాలు తెలుసుకుంటాను. ప్రత్యేకాధికారి ఆదేశాల మేరకే సామగ్రి కొనుగోళ్లు జరిగాయి.

– విక్రమ్‌సింహారెడ్డి, కమిషనర్, తాండూరు

నిబంధనలకు తూట్లు

ఇష్టానుసారంగా హైవే డ్రైన్ నిర్మాణ పనులు


మల్లప్ప మడిగ వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించకుండానే ఇరుకుగా నిర్మిస్తున్న డ్రైన్

తాండూరు టౌన్: పట్టణం మీదుగా వెళ్తున్న నేషనల్ హైవే 167(ఎన్) డ్రైన్ నిర్మాణ పనులు ఇష్టానుసారంగా కొనసాగుతున్నాయి. అడిగేవారు లేరని సదరు ఆర్‌అండ్‌బీ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నారు. దీనిపై ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పాటు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక బస్టాండు నుంచి చించోళి మార్గంలో నేషనల్ హైవే రోడ్డుకు ఇరువైపులా ఆర్‌అండ్‌బీ అధికారులు డ్రైన్ నిర్మాణ పనులు చేస్తున్నారు. అయితే రోడ్డుపై అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్‌లను తొలగించకుండానే పనులు ప్రారంభించారు. నిబంధనల ప్రకారం డ్రైన్‌కు లోపల ఉన్న విద్యుత్ సంబంధితమైనవి ఏవీ ఉన్నా వాటిని తొలగించిన తర్వాత నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అయితే సదరు ఆర్‌అండ్‌బీ అధికారులు దీనికి భిన్నంగా ఎక్కడ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను అక్కడే ఉంచి ఇరుకుగా, వంకలు తిప్పుతూ పట్టణంలోని మల్లప్ప మడిగ వద్ద డ్రైన్ నిర్మిస్తున్నారు. దీంతో ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు తొలగించాలని విద్యుత్ అధికారులకు అర్జీ పెట్టుకుని, అందుకు అయ్యే ఖర్చును భరించాల్సి ఉంటుంది. కానీ అవేవి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి డ్రైన్ నిర్మాణ పనులు సక్రమంగా జరిగేలా చూడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

బీసీ సేన జాతీయ అధ్యక్షుడు కృష్ణ

షాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం షాబాద్ మండల పరిధి చందనవెల్లి గ్రామంలో బీసీసేన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అధ్యక్షుడిగా చాకలి శ్రీశైలం, ఉపాధ్యక్షుడిగా గడీల మహిపాల్, ప్రధాన కార్యదర్శిగా మల్లేశ్, యువజన కమిటీ అధ్యక్షుడిగా చిప్పలపల్లి శ్రీశైలం, ఉపాధ్యక్షుడిగా శివలను నియమించారు. అనంతరం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. బీసీలు సామాజికంగా, ఆర్థికంగా, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో అభివృద్ధి సాధించాలంటే గ్రామస్థాయి నుంచే ఐకమత్యం కావాలన్నారు. అందుకే ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో బీసీలను బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీసేన మండల అధ్యక్షుడు కమ్మరి దయాకర్‌చారి, జిల్లా నాయకులు వెంకటేశ్, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి, కార్యదర్శి చంద్రశేఖర్, నందిగామ మండల ఉపాధ్యక్షుడు నర్సింహులు, షాబాద్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్, గ్రామ పెద్దలు చేవెళ్ల స్వామి, మాజీ సర్పంచ్‌లు లింగం, శ్రీనివాస్‌గౌడ్, నాయకులు రాఘవచారి, మల్లేశ్, వెంకటేశ్, వడ్ల మల్లేశ్, తదితరులు ఉన్నారు.

మహాసభ సభ్యత్వం తీసుకోవాలి

మున్నూరు కాపు సంఘం తాలూకా నాయకులు


మాట్లాడుతున్న చంద్రశేఖర్

కొడంగల్: రాష్ట్ర మహాసభలో కులస్తులందరూ సభ్యత్వం తీసుకోవాలని మున్నూరు కాపు సంఘం తాలూకా అధ్యక్షుడు బాకారం చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి బి.మల్లయ్య కోరారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని కాచిగూడ కార్యాలయానికి మహాసభ అనుబంధంగా ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని కొడంగల్, ఉడిమేశ్వరం, పర్సాపూర్, దుద్యాల, అలిఖాన్‌పల్లి, పాత కొడంగల్, కొండారెడ్డిపల్లి గ్రామ కమిటీ సభ్యులతో పాటు కొడంగల్, దుద్యాల, దౌల్తాబాద్ మండల కమిటీలు, యువజన కమిటీలు, మహిళా కమిటీ సభ్యులు రాష్ట్ర మహాసభ సభ్యత్వం తీసుకోవాలన్నారు. ఈనెల 26వ తేదీ వరకు సభ్యత్వం తీసుకోవడానికి నిర్ణయించినట్లు చెప్పారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు పెద్ది పెంటయ్య, ప్రధాన కార్యదర్శి జైపాల్‌రెడ్డి సూచన మేరకు సభ్యత్వాలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కులస్తులందరూ రాష్ట్ర మహాసభ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం, ఓటు వేసే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు సిరుసని శ్యాంసుందర్, అరిగె ఓం ప్రకాశ్, కోశాధికారి కానుకుర్తి నర్సిరెడ్డి, ప్రచార కార్యదర్శి మున్నూరు బిచ్చప్ప తదితరులు పాల్గొన్నారు.

‘టెక్స్‌టైల్’ భూముల విక్రయానికి యత్నం!


టెక్స్‌టైల్ పార్క్ ఎదుట ఆందోళన చేస్తున్న సొసైటీ సభ్యులు, రైతులు

నిరసన వ్యక్తంచేసిన సొసైటీ సభ్యులు

నందిగామ: టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేసి, స్థానికులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో కొనుగోలు చేసిన భూమిని విక్రయించేందుకు కొందరు డైరెక్టర్లు యత్నిస్తున్నారని సొసైటీ సభ్యులు ఆరోపించారు. కొందరు రైతులతో కలిసి ఆదివారం హైదరాబాద్ హైటెక్ టెక్స్‌టైల్ పార్క్ వద్ద ఆదివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 2002, 2003 సంవత్సరంలో టెక్స్‌టైల్ పార్క్ కోసం చేగూరు రెవెన్యూ పరిధి నర్సప్పగూడ గ్రామ శివారులో 142 ఎకరాల భూమిని కొనుగోలు చేశామని తెలిపారు. ఆ సమయంలో 108 మంది సభ్యులు, 8 మంది డైరెక్టర్లతో ఒక సొసైటీని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఆ భూమిలో ప్రభుత్వ రాయితీతో పరిశ్రమలు ఏర్పాటు చేసి, స్థానికులకు, భూములు ఇచ్చిన రైతు కుటుంబాలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ముందుకు వచ్చామని వివరించారు. కానీ అనుకున్న ఆశయం నెరవేరకుండా కొందరు డైరెక్టర్లు ఎవరికీ తెలియకుండా ఆ భూములను అమ్మకానికి పెట్టారని ఆరోపించారు. తామంతా కష్టపడి సంపాదించిన డబ్బులతో భూములు కొనుగోలు చేశామని, మా భూములు మాకు కేటాయిస్తే పరిశ్రమలు స్థాపించి, పలువురికి ఉపాధి చూపుతామని చెప్పారు. సంబంధిత అధికారులు స్పందించి, జాగల విక్రయానికి యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకుని, ఆ భూములను తమకు అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో బోర్డు సభ్యులు పురుషోత్తం, గడ్డం దేవదాస్, వెంకటరమణ, శ్రీరాములు, సురేంద్ర, రవి, రమేష్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న బైక్, ఒకరి మృతి

యాచారం: బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. నగర శివారులోని జిల్లెలగూడకు చెందిన శ్రీనాథ్(18), స్నేహితులు మణిదీప్, చరణ్‌లతో కలిసి శనివారం నల్గొండ జిల్లా దేవరకొండ సమీపంలోని వైజాక్ కాలనీకి వెళ్లారు. ఆలస్యం కావడంతో రాత్రి చింతపల్లి మండలం వింజమూర్‌లోని బంధువుల ఇంట్లో నిద్రించారు. ఆదివారం తెల్లవారు జామున నాలుగున్నర గంటలకు శ్రీనాథ్.. మిత్రులతో కలిసి బైక్‌పై నగరానికి బయలుదేరాడు. మార్గ మధ్యలో సాగర్‌రోడ్డుపై చౌదర్‌పల్లి గేట్ వద్ద బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనాథ్ దుర్మరణం చెందగా.. మణిదీప్, చరణ్‌లు గాయపడ్డారు. కేసు దర్యాప్తులో ఉంది.

భార్యతో గొడవ: భర్త ఆత్మహత్య

రాజేంద్రనగర్: భార్య గొడవపడి పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపం చెందిన భర్త ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఐదు రోజుల అనంతరం ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ మామిడి కిశోర్ సమాచారం మేరకు... ఉప్పర్‌పల్లి ఫ్రెండ్స్ కాలనీకి చెందిన ఎస్.రాజు(32) తన భార్య ఉమారాణితో కలిసి నివసిస్తున్నాడు. కారు డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత వారం భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. అలిగిన భార్య ఉమారాణి పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న రాజు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఐదు రోజుల క్రితం ఈ సంఘటన జరగడంతో మృతదేహం పూర్తిగా కుళ్లిపోయింది. ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు ఆదివారం ఉదయం రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఇంటి తలుపులు బద్దలు కొట్టి చూడగా ఆత్మహత్య చేసుకొని ఉన్నాడు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

నిధులు లేక కటకట

- పంచాయతీ నిర్వహణకు అప్పులభారం
- ట్రాక్టర్ డీజిల్‌కు సైతం ఇబ్బంది
- సొంత నిధులు వెచ్చించలేమని కార్యదర్శుల ఆవేదన
- గ్రామాల్లో అటకెక్కిన పరిపాలన


పనులు చేయలేమని ఎంపీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు (ఫైల్)

పరిగి: గ్రామాల్లో ప్రత్యేక పాలన వెక్కిరిస్తోంది. నిధులు లేకపోవడంతో పనులు సాగడం లేదు. దీంతో పాలన కార్యదర్శులకు రోజురోజుకూ భారంగా మారుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన నిధులు నెలల తరబడి విడుదల కాకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు అప్పుల పాలవుతున్నారు. చిన్న పంచాయతీల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఇటీవల పరిగి, దోమ మండలాల్లోని అన్ని గ్రామాల కార్యదర్శులు సమస్యల పరిష్కారానికి డబ్బులు లేవని ఎంపీఓ, ఎంపీడీఓలకు వినతిపత్రం అందజేసి పంచాయతీ ట్రాక్టర్ల తాళాలను అందజేశారు. అదే బాటలో మిగతా కార్యదర్శులు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చిన్న జీపీలు కుదేలు

జిల్లాలో 20 మండలాలు ఉండగా 566 గ్రామ పంచాయతీలున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు విడుదల కాక పోవడంతో విద్యుత్ బిల్లులు, కార్మికుల వేతనాలు, వీధి దీపాల బిల్లులు, ట్రాక్టర్ నిర్వహణ, బోరు మోటార్ల మరమ్మతులు తదితర వాటికి కాసులు లేక అరిగోసలు పడుతున్నారు. పెద్ద పంచాయతీలకు వస్తున్న కొద్దిపాటి ఆదాయంతో అభివృద్ధి పనులు ఓ మోస్తరుగా సాగుతున్నాయి. కానీ చిన్న పంచాయతీల్లో మాత్రం ఎలాంటి పనులు జరగడం లేదు. రోజు రోజుకూ పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి దీనంగా మారుతుందని, అప్పుల కుప్పలుగా మారుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. తాము గ్రామాల్లో సొంత ఖర్చులతో పనులు చేయలేమని కార్యదర్శులు ఉన్నతాధికారులకు తేల్చి చెప్పారు.

కొరవడిన ప్రభుత్వ సహకారం

కేంద్రం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు విడుదల కావడం లేదు. గత 20 నెలలుగా గ్రామాలకు ఆర్థిక సంఘం నిధులు రావడం లేదు. ఇక రాష్ట్రం నుంచి రావాల్సిన నిధులైతే 2022 నుంచి నిలుపుదల చేశారు. స్థానిక సంస్థల్లో పాలకవర్గం లేకపోవడంతో గ్రామ పంచాయతీలకు కేంద్రం నిధులు విడుదల చేయడం లేదు. కొంత కాలంగా పల్లెల్లో సమస్యలను పంచాయతీ కార్యదర్శులే నిర్వహిస్తున్నారు. ఇలా చాలా మంది కార్యదర్శులు అప్పులు చేసి పనులు చేపట్టారు. అయినా ప్రభుత్వం నుంచి సహకారం రాకపోవడంతో తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అప్పులు చేశాం



గ్రామంలో నిత్యం ఎక్కడో ఒక చోట సమస్యలుంటాయి. తొలుత ప్రత్యేక పాలనలో ఇబ్బందులు రాకున్నా దినదినం భారంగా మారుతుంది. వచ్చే జీతం డబ్బులు కూడా గ్రామ సమస్యల కోసం ఖర్చు చేస్తున్నాం. అవి సరిపోకపోవడంతో అప్పులు చేశాం. ఊరిలో సమస్యలు పరిష్కరించాలంటే ఇక సొంత డబ్బులు ఖర్చు చేయలేము.

– వేమారెడ్డి, పంచాయతీ కార్యదర్శి, రాఘవపూర్

లారీ ఢీకొని యువకుడి మృతి


టిల్లు(ఫైల్)

ఆమనగల్లు: లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం పట్టణంలోని హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఎస్ఐ సీతారాం రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆమనగల్లు మున్సిపాలిటీ ముర్తుజపల్లి గ్రామానికి చెందిన మహేందర్‌నాథ్ అలియాస్ టిల్లు(23) బైక్‌పై వెళ్తున్న క్రమంలో కల్వకుర్తి నుంచి మధ్యప్రదేశ్‌కు పత్తిలోడ్‌తో వెళ్తున్న లారీ కాటన్‌మిల్లు సమీపంలో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఇదే సమయంలో కల్వకుర్తి నుంచి నగరానికి వెళ్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించాడు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆర్థిక సహాయం అందజేశారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

అనంతగిరి: హర్యానా ప్రాంతానికి చెందిన 20 డిఫెన్స్ మద్యం బాటిళ్లను హైదరాబాద్‌కు తీసుకెళ్తున్న క్రమంతో రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వికారాబాద్‌లో పట్టుకున్నారు. ఒక కారులో డిఫెన్స్ మద్యం వస్తుందనే పక్కా సమాచారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుభాష్‌చంద్ర తన సిబ్బందితో కలిసి ఎన్నెపల్లి చౌరస్తాలో శనివారం తనిఖీలు చేశారు. కారులో నుంచి 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు అందులో ప్రయాణిస్తున్న నలుగురిపై కేసు నమోదు చేశారు. అనంతరం కార్‌ను సీజ్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్ తెలిపారు.

ఆదివారం ఆగని దందా

- సెలవు రోజుల్లో పుస్తకాల విక్రయం
- నిబంధనలు పాటించని పాఠశాలలు
- చర్యలు తీసుకోవాలంటూ ఎస్ఎఫ్ఐ డిమాండ్


ఎస్ఎఫ్ఐ నాయకులతో వాగ్వాదానికి దిగిన పాఠశాల సిబ్బంది

షాద్‌నగర్‌రూరల్: ప్రైవేట్ పాఠశాలల్లో సెలవురోజున పుస్తకాల దందా కొనసాగుతోందని, నిబంధనలు పాటించని యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఆదివారం బుక్స్ విక్రయిస్తుండగా.. ఎస్ఎఫ్ఐ నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇదేమిటని ప్రశ్నించిన తమపై అక్కడి సిబ్బంది దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. విద్యార్థుల తల్లితండ్రులకు ఫోన్‌చేసి రాత పుస్తకాలు తీసుకుంటేనే పాఠ్యపుస్తకాలు ఇస్తామని మెలిక పెడుతూ.. ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. అధిక ధరలకు నోట్స్‌ను అంటకడుతూ డబ్బులు దండుకుంటున్నారని తెలిపారు. పాఠశాలల నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా.. విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇదే విషయమై గతంలో మండల విద్యాధికారికి వినతిపత్రం అందజేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి.. బుక్స్, యూనిఫాంలు అమ్ముతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఆదిల్, రఘు, నవీన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పోచయ్య


పోచయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మొయినాబాద్‌రూరల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ సంఘాలు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు యు.పోచయ్య అన్నారు. ఆదివారం హిమాయత్‌నగర్ సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో స్కూల్ టీచర్ సమాఖ్య(ఎస్‌టీఎఫ్) తెలంగాణ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోచయ్యకు ఓడీ సౌకర్యం లభించడంతో ఆయనను ఆ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. దాంతో పాటే ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి పి.గోపాల్, ప్రతినిధులు విఠల్, రమేష్, రాంచంద్రయ్య, రాంచందర్, నర్సింహులు, లక్ష్మీనారాయణ, దిలీప్, భగవత్‌గీత, రాజారావు, మొయినాబాద్ మండల అధ్యక్షుడు పి.సుధాకర్, వెంకటస్వామి, రజిత, సంతోష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.